సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఎమ్మెల్యే కృష్ణారావుతో బొల్లు శ్రీనివాసరావు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు రాజకీయాలకతీతంగా స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన బొల్లు శ్రీనివాసరావు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. శ్రీ వివేకానందనగర్ కాలనీ సంక్షేమానికి, అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, నాయకులు సుందర కేశవరావు, సత్యనారాయణ, తుంగం రామారావు, గుత్తికొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్ బోర్డు స్థలంలో పార్కింగ్ చేసిన కార్లు

హౌసింగ్ బోర్డు స్థలంలో అక్రమంగా పార్కింగ్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలంలో అనుమతులు లేకుండా కార్లను పార్కింగ్ చేస్తున్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని మలేషియా టౌన్‌షిప్ వెనకాల ఉన్న హౌసింగ్ బోర్డు స్థలంలో లోదా మెరీడియన్ రెసిడెన్షియల్ వారు కార్లను పార్కింగ్ చేస్తూ ఆ స్థలాన్ని పార్కింగ్ ప్రాంతంగా వాడుకోవటం పట్ల పలువురు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్ వల్ల ఆడుకోవడానికి వీలు లేకుండా ఉందని యువకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్‌పై జీహెచ్‌ఎంసీ వారిని సంప్రదించగా.. స్థలం హౌసింగ్ బోర్డుకు చెందిందని, అది తమ పరిధిలోకి రాదని తెలిపినట్లు స్థానికులు తెలిపారు. పార్కింగ్ చేసేవారు హౌసింగ్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవటం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

హౌసింగ్ బోర్డు స్థలంలో కారు పార్కింగ్ కోసం తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. హౌసింగ్ బోర్డు వారు జీహెచ్‌ఎంసీ వారికి కొన్ని స్థలాలను కేటాయించారు. త్వరలో పరిశీలించి దీనిపై తగిన చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌బాబు, కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు డీఈ

నీటి సమస్యను పరిష్కరించాలి


సమస్యపై చర్చిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మంచినీటి సరఫరాలో అంతరాయం, లో ప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. సమస్యను పరిష్కరించాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ మూసాపేట సెక్షన్ మేనేజర్ సలోమిని మంగళవారం కలిసి సమస్యపై మాట్లాడారు. లీకేజీల కారణంగా ప్రెషర్ సమస్య ఉందని, ప్రస్తుతానికి లీకేజీ సమస్యలను తొలగించామని సలోమిని తెలిపారు.

శ్రావణమాసం పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి

ఆల్విన్‌కాలనీ: శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని మల్లికార్జున స్వామి ఆలయంలో కొలువుదీరిన ప్రసన్నాంజనేయ స్వామికి వడమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినియోగదారులతో కళాసిల్క్ కళకళ


సిల్క్ ఎక్స్‌పోలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మోతీనగర్: చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలని కళాసిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో మోతీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో హ్యాండ్‌లూమ్ సిల్క్ ఎక్స్‌పోను ఆధునిక హంగులతో ఏర్పాటు చేశారు. ఈ వస్త్ర ప్రదర్శనకు పరిసర ప్రాంత ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని నిర్వాహకులు వికాశ్ జైన్ తెలిపారు. శుభకార్యాలకు అవసరమైన అన్ని రకాల వసువులు, ఆకట్టుకునే రంగులు, మైమరిపించే డిజైన్లతో వివిధ రకాల వస్త్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. వివిధ మోడళ్లలో ఆధునీకరణ మైన వస్తువులు, గృహ ఉపకరణాలు, హస్త కళాకారులు తయారు చేసిన వివిధ ఆకారాలు, బొమ్మలను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో పోచంపల్లి, ఉప్పాడ, బెనారస్, భగల్పూర్ సిల్క్, కాశ్మీర్ సిల్క్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, బెంగాల్ కాటన్ శారీస్, కోటా శారీస్, లక్నో చికెన్ వర్క్ కుర్తీస్, హర్యానా బెడ్ షీట్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 25 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

అవగాహనతోనే దోమల నిర్మూలన


మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబురావు తదితరులు

కొనసాగుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం

మూసాపేట: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, డివిజన్ ఇన్‌చార్జి టీకే ప్రభాకర్, సీఓ సురేష్‌లతో కలిసి బాలాజీనగర్ డివిజన్‌లోని చిత్తారమ్మ నగర్, ముష్కిపేట్, ఆంజనేయనగర్‌లలో పర్యటించి పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల లాభాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పూలకుండీలు, కూలర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూబీడీ సమతా, నాయకులు భాస్కర్‌రావు, శ్రీశైలం, రాజు, లక్ష్మి, లత, కార్మికులు, ఎస్‌ఎఫ్‌ఏలు, ఆర్‌పీలు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇక శుభ్రంగా సర్కారు బడులు..!

- పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ అధికారులు
- మేడ్చల్ జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు.. 96,284 మంది విద్యార్థులు
- జిల్లా మినరల్ ఫండ్ నుంచి నిధులు
- అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లోకి జమ
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయింపు
- నెలకు రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు
- పంచాయతీ సిబ్బందికి కలగనున్న ఉపశమనం



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ జీవో21ను విడుదల చేయగా, అన్ని పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపొజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ నిధులు అందజేయనున్నారు. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ఉపశమనం కలుగనున్నది. ఇప్పటివరకు సర్కారు బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను జిల్లా పంచాయతీ శాఖ, పురపాలికలు చూసుకుంటున్నాయి. ఇక మీదట ఆ వ్యవహారాలను అమ్మ ఆదర్శ కమిటీలు చూడనున్నాయి.

అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లోకి జమ..

ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక నిధులు నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమకానున్నాయి. 3 నెలలకు సంబంధించిన నిధులను ముందే వారి ఖాతాల్లో జమ చేయాలని విద్యాశాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 96,284 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నుంచి ఈ నిధులను అందజేయాలని విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక నుంచి నిత్యం పాఠశాల పరిసరాలు అందంగా ఉంచడంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పట్టడం తదితర పనుల్ని నిర్వహించాల్సి ఉంటుంది. పాఠశాలల్లో శుభ్రత కోసం అవసరమైన వస్తువులను సమగ్ర శిక్ష నిధులను వెచ్చించాల్సి ఉంటోందని తెలుస్తోంది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల కేటాయింపు

విద్యార్థుల సంఖ్య -	నిధుల కేటాయింపు
1-30 మంది	రూ.3 వేలు
31-100 మంది	రూ .6వేలు
101- 250 మంది	రూ.8వేలు
251-500 మంది	రూ.12 వేలు
501 -700 మంది	రూ.15 వేలు
750 మందికిపైన	రూ.20 వేలు

బడుల్లో తొలగనున్న ఇబ్బందులు..

గత ప్రభుత్వం స్కావెంజర్లను తొలగించడంతో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమస్య తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ పనుల బాధ్యతల్ని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చూసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. అసలే పంచాయతీల్లో అరకొరగా ఉన్న పారిశుద్ధ్య సిబ్బందికే పాఠశాలల బాధ్యతల్ని అప్పగించడంతో పలు చోట్ల ఇబ్బందులు తలెత్తాయి. పంచాయతీల పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను వదిలివేయగా, పంచాయతీ, విద్యాశాఖల మధ్య వివాదాలు కూడా తలెత్తిన సందర్భాలు ఉన్నాయి. దీంతో తరగతి గదులు, పరిసరాల శుభ్రత అంతంత మాత్రంగానే ఉండేది. వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో పంచాయతీ సిబ్బందికి పని భారం తగ్గనుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి నెల రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఇవ్వాలని నిర్ణయించడంతో పారిశుద్ధ్య పనులకు కూలీలు పోటీ పడే అవకాశం లేకపోలేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై తదుపరి చర్యలకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది.

కుక్కకాటుతో ఇద్దరికి గాయాలు



కుక్కకాటుకు గురైన చిన్నారి నిషా, యువకుడు రాజు

మోతీనగర్: కుక్క కాటుతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లో చోటు చేసుకుంది. అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్ ఎండి జలీల్ కుమారుడు నిషా (2) సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వస్తుండగా వీధిలో వెళుతున్న కుక్క మెడను అందుకోవటంతో స్థానికులు వెంటనే దానిపై దాడి చేయడానికి ప్రయత్నించగా పారిపోయింది. అదే విధంగా రాజు అనే యువకుడు ఇంటి నుంచి బయటకు వస్తుండగా అతని పిక్క పట్టి లాగడంతో ఆందోళనకు గురయ్యాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

మూసాపేట: మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... నిజాంపేటలోని అపార్టుమెంట్‌లో మందాడి సుజాత (43) వేణుగోపాల్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. సుజాత బ్యూటీ పార్లర్ నడిపిస్తుంది. కూకట్‌పల్లి బాగ్‌అమీర్‌లో ఉండే కుటుంబ స్నేహితుడైన వెంకటరామిరెడ్డితో కలిసి ఇంటీరియర్ డిజైనర్‌గా కూడా పని చేస్తున్నది. బాగ్‌అమీర్‌లోని ఇంటీరియర్ కార్యాలయంలో సోమవారం ఎవ్వరూ లేని సమయంలో వెంకటరామిరెడ్డికి ఫోన్ చేసి.. చనిపోవాలని ఉందని చెప్పి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వెంటనే వెంకటరామిరెడ్డి పక్కషాపు వారికి, కూతురు సుజాతకు ఫోన్‌చేసి విషయం తెలుపగా.. వారు షాపు వద్దకు వెళ్లే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: దోమల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. 6వ ఫేజ్‌లోని శివాలయం బతుకమ్మ కుంటలో దోమల లార్వా పెరగకుండా గంబూషియా చేప పిల్లలను మంగళవారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సాయి ప్రసాద్, ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బంది సురేష్ రెడ్డి, జీఎల్‌ఎన్ రెడ్డి, భాస్కర్ నాయి, రామస్వామి, ప్రసాద్, శ్రీరామ్, సుబ్రహ్మణ్యం, రాజు, సోమేష్, రసూద్, మహబూబ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు


కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ జన్మదిన వేడుకలు నాయకులు, శ్రేయోభిలాషులు, అభిమానుల మధ్య మంగళవారం ఘనంగా జరిగింది. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగం కనకరాజుయాదవ్, కుంటన్న శ్రీనివాస్ ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని హస్మత్‌పేట బోయిన్ చెరువు దగ్గరలో దోమల నివారణ కోసం ఆయిల్ బెలూన్స్ వదిలారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది మహిపాల్‌రెడ్డి, సుదర్శన్ స్వామి, రాంకీ సూపర్‌వైజర్ అరుణ, చైతన్య, రాధ, శ్రీలేఖ, మల్లేష్‌యాదవ్, చందు యాదవ్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.

వినాయక పార్కులో మొక్కల పంపిణీ


అధికారులతో కలిసి అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం సందర్భంగా వినాయక పార్కులో మంగళవారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాట్లాడుతూ.. మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వాయిద్ అలీ, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఏఈ చైతన్య, ఇంజినీరింగ్ ఏఈ ఆశ, శానిటేషన్ జవాన్ కుమార్, యూబీడీ దివ్య, ఎంటమాలజీ సిబ్బంది, కాలనీ సభ్యులు వెంకటేశ్వరరావు, సూర్యప్రకాష్‌రావు, శివరాం ప్రసాద్, రజిని కాలనీవాసులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి కార్పొరేటర్ పరామర్శ


రాజ్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: బీఆర్‌ఎస్‌అల్లాపూర్ డివిజన్ సోషల్ మీడియా అధ్యక్షులు మడపత్యోగి రాజ్ రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్నాడు. మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం అతడిని పరామర్శించి మాట్లాడారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆమెతో పాటు మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాయకులు జ్ఞానేశ్వర్, ఖదీర్, రజాక్ పరామర్శించారు.

ప్రతి దరఖాస్తుదారుడికి లబ్ధి


చెక్కులను అందజేస్తున్న బండి రమేష్, వెంకటేశ్వరరావు

బాలానగర్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రతి దరఖాస్తుదారుడికి లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని 50 మంది లబ్ధిదారులకు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో రూ.45 లక్షలకు పైగా విలువ కలిగిన చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేయటం అభినందనీయమన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కీసర: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన కీసరలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసరకు చెందిన కండ్లకోయ పరమేశ్ కుమారుడు సైదులు ముదిరాజ్ (21) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి లారీ తీసుకుని అంకిరెడ్డి పల్లికి వెళ్తుండగా కీసర సమీపంలోని పెద్దమ్మ చెరువు వద్ద జేసీబీ ఆగి ఉండడం గమనించాడు. దాని వెనకాల తన లారీ ఆపి దిగి జేసీబీ వద్దకు వెళ్లి డ్రైవర్‌తో మాట్లాడి తిరిగి వస్తుండగా అదే సమయంలో వెనకాల నుంచి వచ్చిన రెడీమిక్స్ లారీ వేగంగా వచ్చి తన లారీని ఢీకొట్టడంతో అది వచ్చి సైదులను తాకింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.


వివేకానందనగర్ డివిజన్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ రెక్టార్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. వెంకటేశ్వరరావు


ఆంజనేయనగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రొఫెసర్ జయశంకర్ జీవితం స్ఫూర్తిదాయకం

- జయంతి సభలో ప్రజాప్రతినిధులు
- నియోజకవర్గ వ్యాప్తంగా ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జయశంకర్ తెలంగాణ కోసం పరితపించిన మహానుభావుడని, ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నాలుగు కోట్ల ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన జయశంకర్‌ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు.

– కూకట్‌పల్లి


జయశంకర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు


నివాళులర్పిస్తున్న కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు


జయశంకర్ కాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు


కాలనీ వాసులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్